పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

- లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలి
- ఎల్‌ఆర్‌ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు పెంచాలి : విలేకర్ల సమావేశంలో జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్-ఎల్‌బీసీ, ఎస్‌ఆర్‌ఎస్‌పీ, డిండి ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేక నిలిచిపోయాయని అన్నారు. వెంటనే దీనిపై సమీక్ష నిర్వహించి నిధులు కేటాయించి ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని లిఫ్టులను ప్రాజెక్టు అంతర్భాగంలోకి తీసుకొని ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను గ్యారెంటీగా అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ధాన్యం మార్కెట్లోకి వస్తుందని, మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారుల, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా రైతుల పండించి పంటకు మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు మరో నెలరోజులపాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

గడువు చివరి రోజుల్లో ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల ఎక్కువ మంది వినియోదారులు పన్నులు చెల్లించలేకపోయారని, అదేవిధంగా ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని వాటిని తొలగించి ఫీజు రాయితీ 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అడవిదేవులపల్లిలో సత్రశాల బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లయితే వ్యవసాయం, పారిశ్రామికరంగం అభివృద్ధి చెందడంతోపాటు రెండు రాష్ట్రాలకు ప్రయోజకరంగా ఉంటుందని చెప్పారు.

అదేవిధంగా డంపింగ్ యార్డ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ముఖ్యమంత్రి దృష్టి సారించి సమీక్ష పెట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవి నాయక్, పాదురీ శశిధర్‌రెడ్డి, భవాండ్ల పాండు, లక్ష్మీనారాయణ వెంకటరెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా మూల్యాంకనం చేపట్టాలి

- విద్యార్థులకు న్యాయంగా మార్కులు కేటాయించాలి
- ఎగ్జామినర్లకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశం
- మేడ్చల్ జిల్లా మూల్యాంకన కేంద్రం పరిశీలన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న మేడ్చల్ జిల్లా జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఎగ్జామినర్ల పనితీరును ఆయన పరిశీలించారు. సమయపాలన పాటించాలనీ, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు న్యాయంగా మార్కులను కేటాయించాలని కోరారు. ప్రతి ఎగ్జామినర్ జాగ్రత్త వహించాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన విధిని అత్యంత పారదర్శంగా నిర్వహించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. మూల్యాంకన కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ ప్రక్రియలను పరిశీలించి సిబ్బందికి మూల్యాంకన ప్రక్రియలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉగాది సందర్భంగా మూల్యాంకన కేంద్రాలకు ఆదివారం సెలవు ప్రకటించామని తెలిపారు. సెలవు అనంతరం మూల్యాంకనం మరింత సమర్థవంతంగా కొనసాగించి నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అమెరికా జట్టుకు టీడీసీఏ షాక్

హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 వన్డే ట్రోఫీలో అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ (ఏవైసీఏ) జట్టుకు టీడీసీఏ రూరల్ జట్టు షాక్ ఇచ్చింది. వరుస విజయాల ఊపుమీదున్న ఏవైసీఏపై 21 పరుగుల తేడాతో గెలుపొందింది. అభినవ్ గౌడ్ (143) సెంచరీతో చెలరేగటంతో టీడీసీఏ రూరల్ తొలుత 40 ఓవర్లలో 243/10 పరుగులు చేసింది. ఛేదనలో ఏవైసీఏ 49.1 ఓవర్లలో 222 పరుగులకు కుప్పకూలింది. తనూశ్ (92 నాటౌట్) పోరాడినా.. అమెరికా యూత్ జట్టుకు ఓటమి తప్పలేదు. అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలంగాణ జట్టును టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు.

ఆహార భద్రత అధికారులను నియమించాలి

- ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలి
- మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబులను పని చేయించాలి : సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహార భద్రత అధికారులను నియమించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఫోరం అధ్యక్షులు యం.పద్మనాభరెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాదులో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ లను ఏర్పాటు చేయాలనీ, మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబులను పని చేయించాలని ఆయన కోరారు. ఆహార భద్రత అధికారులు లేకపోవడంతో కల్తీ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒకటే ఉందనీ, అందులో పరీక్ష నిమిత్తం సరియైన పరికరాలు లేవని తెలిపారు. ఈ లేబొరేటరీలో సైంటిస్టులు, ఇతరులు కలిపి 78 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 11 మంది మాత్రమే పని చేస్తుండటంతో ఈ ల్యాబ్ నామమాత్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వము రెండు సంవత్సరాల క్రితం వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాదులో ల్యాబులు మంజూరు చేసి నిధులు కూడ విడుదల చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను వినియోగించుకోలేకపోవడంతో ఆ నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఒక సంచార ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఉన్నప్పటికీ అందులో సరిపడ పరికరాలు లేక పరీక్షలు అంతంత మాత్రమే జరుగుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం 5 వ్యానులైతే కొన్నారు కాని అందులో పరీక్షల కొరకు కావలసిన పరికరాలు కొనకపోవడంతో కేంద్ర నిధులు ల్యాప్స్ అయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. గతంలో ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆహార కల్తీ గురించి ప్రజలు ఫిర్యాదు చేయడానికి ఒక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించినా అది కార్యరూపం దాల్చక కాగితాలకే పరిమితమైందని వెల్లడించారు.

స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్

ముగిసిన జాతీయ కరాటే పోటీలు

హైదరాబాద్ : 2027 ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు హైదరాబాద్ వేదిక కానుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ 'హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్'గా తీర్చిదిద్దుతున్నారని పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నాలుగు రోజుల పాటు జరిగిన జాతీయ కరాటే పోటీలు శనివారంతో ముగిశాయి. 1500 మంది క్రీడాకారులు పోటీపడిన ఈవెంట్‌లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు, జట్లకు మహేశ్‌కుమార్ గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరాటే క్రీడాకారులకు సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశాన్ని పంపించారు.



























Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | మార్చి 30, 2025 | www.navatelangana.com

అర్హత పొందిన వారు నవోదయలో రిపోర్ట్ చేయాలి



నవతెలంగాణ-నిజాంసాగర్

నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులు.. నిజాంసాగర్‌లో గల నవోదయ విద్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపల్ జానకీరామ్ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి, 9వ తరగతి కోసం జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలు ఇటీవలే వెలువడగా.. ఆరో తరగతిలో అర్హత పొందిన విద్యార్థులు ఏప్రిల్ 2వ తేదీన విద్యాలయంలో హాజరుకావాలని, 9వ తరగతిలో అర్హత పొందిన విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీన విద్యాలయంలో హాజరుకావాలని ఆయన తెలిపారు. పర్సనల్ ఎడ్యుకేషన్ నెంబర్, స్టూడెంట్ ఆధార్, క్యాస్ట్, అర్బన్, రూరల్ సర్టిఫికేట్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

నీటి తొట్టీలలో నీరు నింపాలి

- పశువుల దప్పిక తీర్చాలని కార్యదర్శులకు సూచించిన పశువైద్యాధికారి సంతోష్

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని ఆయా పంచాయతీలలో నిర్మించిన "పశువుల నీటి తొట్టిలను' శుభ్రం చేసి అన్ని వేళల నీటి నిల్వతో ఉండేలా చర్యలు చేపట్టాలని పంచాయతీల సెక్రటరీలను మండల పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి సంతోష్ సూచించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముదురుతున్న నేపథ్యంలో మూగ జీవాలు దప్పికతో అల్లాడుతుంటాయని అందుకుగాను మానవ దృక్పథంతో మనందరి బాధ్యతగా పశువుల దాహార్తి తీర్చుటకుగాను పంచాయతీలలో గల పశువుల నీటి తొట్టిలను చిన్న చిన్న మరమ్మతులు చేసి వాటిని శుభ్రపరచి అన్నివేళలా అన్నివేళలా నీటితో నిండుకుండలా ఉండేలా చర్యలు చేపట్టి పశువుల దహర్తి తీర్చుటకు పంచాయతీ సెక్రటరీలు సహకరించాలని ఆయన కోరారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన సీపీఐ(ఎం) నాయకులు, ప్రజలు

ఆర్థికంగా బలోపేతమవ్వాలి

- మహిళా సంఘాలకు 183 కొనుగోలు కేంద్రాలు
- గతం కంటే 41 శాతం అదనంగా కేటాయింపు
- ఎలాంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళలు ఆర్థికంగా బలోపేతమవ్వాలే అనే ప్రభుత్వ నిర్ణయం మేరకు మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా కేటాయించామన, ఎలాంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. 2024-25 యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లపై గ్రామ అధ్యక్షులు, సబ్ కమిటీ, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆకాంక్ష మేరకు మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోళ్లకు 183 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గతంలో జిల్లాలో 27 కేంద్రాల్లో కొనుగోలు చేసిన మహిళా సంఘాలకు ఈ సారి మరో 156 కేంద్రాలు సంఘాలకు అదనంగా 41 శాతం కేటాయించినట్టు తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. జిల్లాలో ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి అవసరమైన పరికరాలు క్యాలీపర్స్, టార్పాలిన్, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రం, తదితర పరికరాలతో పాటు కేంద్రంలో తాగునీరు, వేసవి దృష్ట్యా నీడ ఏర్పాటు, ఓఆర్ఎస్ పాకెట్స్, తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సన్న బియ్యం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్టు తెలిపారు. రబీ సీజన్‌లో వడగళ్ల వానలు పడే ఆస్కారం ఉంటుందని, టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. 17శాతం తేమ ఉన్న వడ్లను కొనుగోలు చేసుకోవచ్చని, దొడ్డు, సన్నం వడ్లను విడివిడిగా సేకరించి పెట్టాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ చేసి మిల్లులకు తరలించాలని, రైతులకు రెండు రోజుల్లో చెల్లింపులు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు.

అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా జిల్లాలోని మహిళలకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్టు పురుషులతో సమానంగా కొనుగోళ్లు చేయాలన్నారు. అంతకుముందు వడ్ల కొనుగోళ్లు, కొలతలు వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మురళీ కృష్ణ, మహిళా సంఘాల అధ్యక్షులు, ఏపిఎంలు, సిసిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


హాజరైన అధికారులు

రోడ్లు లేవు.. లైట్లు వెలగవ్

- నగరంలోని కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి
- మున్సిపల్ ఎదుట సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో కాలనీల్లో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని సీపీఐ(ఎం) నగర కమిటీ కార్యదర్శి సుజాత అన్నారు. చాలా వార్డుల్లో రోడ్లు లేవని, విద్యుత్ లైట్‌లు సైతం ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. ప్రధానంగా నాగారం ప్రాంతంలో నీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించాలని, ట్రైలర్స్ కాలనీలో బహుజన కాలనీలో మంచినీరు, మురికి కాలువలు, సిసి రోడ్లను నిర్మించాలని, స్తంభాలు వీధిలైట్లు కేటాయించాలని తెలిపారు. నాగారం 80 క్వార్టర్స్‌లో దాదాపు 15 సంవత్సరాలగా అధికారులతో మొరపెట్టుకున్న స్మశాన వాటికకు ఇప్పటివరకు నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా స్మశాన వాటిక పనులు ప్రారంభించాలని, ఎవరైనా మృతి చెందినప్పుడు అంత్యక్రియలకు వెళ్లిన వాళు - చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. అలాగే దొడ్డి కొమురయ్య నగర్‌కు సంబంధించి తాగునీరు సమస్యను మురికి కాలువల సమస్యతో పాటు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఆ ప్రాంతంలో ఉంటున్న మహిళలు ఇంటి నిర్మాణం లేక మరుగుదొడ్ల సౌకర్యం లేక గుట్ట ప్రాంతాలకు వెళ్లడం వలన మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అలాగే పురుషులు పాముకాటుకు తేలుకాటుకు గురవుతున్నారని తెలిపారు. ఏ ప్రాంతాల్లో స్థానిక సమస్యలు తీవ్రంగా ఉన్నాయో వాటిపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, నగర కార్యవర్గ సభ్యులు కటారి రాములు, నగర కమిటీ సభ్యులు అనిత, అనసూయ, స్థానికులు రజియా రేష్మ, జయశ్రీ, సంగీత, జ్యోతి, సునిత, లలిత, విమల భాయ్, సంపత, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

- పోలీస్ కమీషనర్ సాయి చైతన్య



నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రజలందరు ఎలాంటి అభద్రతాభావంతో లేకుండా సుఖశాంతులతో ఉండాలని సీపీ సాయిచైతన్య ఆకాంక్షించారు. నిజామాబాద్ కమిషనరేటు పరిధిలోని ప్రజలందరకి పోలీస్ శాఖ తరపున ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నిలబడేందుకు నిలువనీడ లేదు

- ఎండలోనే బస్సుకోసం ప్రయాణికుల పాట్లు


బస్‌షెల్టర్ లేక.. ఓ దుకాణ సముదాయం వద్ద నీడలో నిల్చున్న ప్రయాణికులు

నవతెలంగాణ-సదాశివనగర్

పద్మాజివాడి చౌరస్తా.. కామారెడ్డి, నిజామాబాద్, బాన్సువాడ వెళ్లేందుకు ప్రధాన జంక్షన్. కానీ ఇక్కడ బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలువ నీడ లేక.. దుకాణ సముదాయాల వద్ద కొద్దిమేర స్థలంలో ఒంటికాలుపై నిలబడుతూ ప్రయాస పడాల్సి వస్తుంది. ఒక వైపు ఎండలు మండుతుండగా.. మరో వైపు నీడ సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చౌరస్తా వద్ద ఓ మోబైల్ సెంటర్ వద్ద ఉన్న కొద్ది పాటి నీడలో ఎక్కువ మంది ప్రయాణికులు నిలబడి వేచి చూస్తున్నారు. అక్కడ నిలబడేంత స్థలం లేకపోవడంతో మరికొందరు కొద్ది దూరంలో ఇతర దుకాణాల వద్ద నిలబడుతుండాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పద్మాజివాడి చౌరస్తాలో ఇరు వైపులా బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని మండల వాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

శ్రీ కాలబైరవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత.. ప్రజలతో మాట్లాడుతూ..

నవతెలంగాణ-రామారెడ్డి/కంఠేశ్వర్

మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి) లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని శనివారం ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. దేవాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆమెకు శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, మండల బి.ఆర్.ఎస్ ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు పడిగల శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి ఉమనగారి మనోహర్ రెడ్డి, గురజాల నారాయణరెడ్డి,పడిగల రాజేశ్వరరావు, రాజా గౌడ్, రాజేందర్ గౌడ్, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ కవిత

కంఠేశ్వర్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎమ్మెల్సీ కవత ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయం ఎల్లమ్మ గుట్టలో ఘణపాటి జోషి మధు సూదన శర్మతో పంచాంగ పఠనం జరగనున్నట్టు మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ తెలిపారు. కావున ఇట్టి పంచాంగ శ్రవణ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ప్రకటనలో పేర్కొన్నారు.

ఓటీ లేకుండానే ఆర్టీజన్స్ కార్మికులతో వెట్టిచాకిరీ

- విద్యుత్ అధికారుల తీరు మారాలి
- సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత ఎన్నో సంవత్సరాలుగా ఓవర్ టైం(ఓటీ) జీతం లేకుండానే ఆర్టీజన్స్ కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న విద్యుత్ అధికారులు తీరు మారాలని సీఐటీయూ నాయకుల డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎస్ఈని ఆర్టిజన్ కార్మికుల సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి నాయకులు మాట్లాడారు. నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ప్రతి సబ్ స్టేషన్ లో నలుగురు ఆపరేటర్లు ఒక వాచ్‌మెన్ ఉండాలని.. కానీ ఒక సబ్ స్టేషన్ లో ఇద్దరు లేదా ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు అంతేకాకుండా ముగ్గురు పని చేస్తున్న దగ్గర ఒకరిని తీసి వారికి ఇచ్చిన ఆర్డర్ సబ్‌స్టేషన్ కాకుండా వేరే సబ్ స్టేషన్‌లో పనులు చేయిస్తున్నట్టు తెలిపారు. ఒక కార్మికుడు నెలకు 208 గంటలు మాత్రమే నిర్వహించాలి. కానీ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఒక్కొక్క (ఆపరేటర్) ఆర్టిజను కార్మికులు 336 గంటలు వరకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పని చేస్తున్న దగ్గర ఒకరిని తీసి వారికి ఇచ్చిన ఆర్డర్ సబ్‌స్టేషన్ కాకుండా వేరే సబ్ స్టేషన్‌లో పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఒక కార్మికుడు నెలకు 8 డ్యూటీలు మాత్రమే నిర్వహించాల్సి ఉన్నా.. నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఒక్కొక్క (ఆపరేటర్) ఆర్టీజను కార్మికులు 13 నుంచి 15 డ్యూటీల చేయిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఎస్ఈ రవీందర్‌ని కలిసి కనీసం నెలకు ఒక్కొక్క ఆపరేటర్లు పది రోజులు మాత్రమే డ్యూటీ చేయించే విధంగా చేయాలని చర్చలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ చర్చల్లో భాగంగా ఎస్ఈ సానుకూలంగా స్పందించి వచ్చేనెల 10వ తారీఖు లోపు తమ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అంతే కాకుండా ఆర్టిజన్ కార్మికుల కమున్మెంట్ కంప్లెషన్ విషయంలో సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ చంద్రారెడ్డి, కంపెనీ అధ్యక్షులు ఆంజనేయులు, కంపెనీ సెక్రెటరీ బొల్లి వెంకట్, రాజు, జగిత్యాల జిల్లా అధ్యక్షులు బుల్లెట్ ఆంజనేయులు, నిజామాబాద్ జిల్లా ఆర్టిజన్ నాయకులు గంగాధర్, జాదో మురళి, థామస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ ఆధ్వర్యంలో ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు

రేషన్ కార్డుల సర్వే నుంచి కార్యదర్శులకు మినయించాలని

ఎంపీడీవోకు జీపీ కార్యదర్శుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ కార్యదర్శులను కార్డుల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని శనివారం ఎంపీడీవో నరేష్ కు మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇంటి పన్నుల వసూలు ఎల్ఆర్ఎస్ వేసవికాలంలో నీటి ఎద్దడి పారిశుద్ధ్య పనులు ఇందిరమ్మ ఇల్లు రెండో విడత సర్వే ఎల్ఆర్ఎస్ తదితర పనులు అప్పగించినట్టు తెలిపారు. దీంతో పాటు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ నర్సరీలు పర్యవేక్షణ సాధారణ ధృవ పత్రాలు అందజేత తదితర పనులు ఇప్పటికే కార్యదర్శులకు తీవ్ర ఒత్తిడిని కలిగిస్తున్నాయని అన్నారు. రేషన్ కార్డుల సర్వే నుంచి కార్యదర్శులకు మినాయింపు ఇవ్వాలని ఎంపీడీవోకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గం ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తానని ఎంపీడీవో అన్నారు.

మోర్తాడ్ బస్టాండ్‌లో చిమ్మచీకట్లు


పూర్తిగా అంధకారంలో ఉన్న మోర్తాడ్ బస్టాండ్

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ బస్టాండ్‌లో రాత్రి వేళ చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. గత రెండు రోజుల నుండి ఆర్టీసీ బస్టాండ్‌లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాత్రి వేళ బస్టాండ్‌లో కాకుండా జాతీయ రహదారిపైకి వచ్చి బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నయి. అసలే ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో విద్యుత్‌దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్టాండ్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధకనబరచాలని డిమాండ్ చేస్తున్నారు.

మాల్‌ప్రాక్టీస్ కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

- ఎస్పీ రాజచంద్ర
- వాట్సప్ అడ్మిన్‌లు జాగ్రత్తగా ఉండాలని సూచన
- వివాదాస్పద పోస్టులు షేర్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌లపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడి



నవతెలంగాణ-కామారెడ్డి

ఈ నెల 26న జుక్కల్‌లో పదో తరగతి పరీక్షలో మాల్ ప్రాక్టీస్‌కు ప్రయత్నించి పరారీలో ఉన్న మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ రాజచంద్ర తెలిపారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జుక్కల్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో కీలక పాత్ర పోషించిన (6) ఆరుగురిని గతంలో అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మరో నిందితుడు నయీమ్‌ఖాన్‌ను తాజాగా శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఎ8గా నయీమ్ ఖాన్ ఓ పత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తూ జుక్కల్ నియోజకవర్గ సమస్యలు వాట్స్ ప్ గ్రూప్‌నకు అడ్మిన్‌గా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. 26వ తేదీనా పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ ప్రయత్నించిన దాని విషయంలో ఎ-7 గంగాధర్ (మన దిన పత్రిక ఎలెక్ట్రానిక్ మీడియా - యుట్యూబ్ చానెల్) వాట్స్ యాప్ గ్రూప్‌లో 5 ప్రశ్నల లీకేజీకి సంబంధించి విషయంలో ఒక క్లిప్‌ను తయారు చేసి జుక్కల్ నియోజక వర్గ సమస్యలు వాట్స్ అప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. గ్రూపులో పోస్ట్ ను చూసి కూడా ఎగ్జామ్ నడుస్తున్న సమయంలో దానివలన విద్యార్థులకు వారి భవిష్యత్తుకు ప్రమాదం ఉన్నదని తెలిసి కూడా అట్టి పోస్ట్‌ను వైరల్ కావడానికి దోహదపడినట్టు తెలిపారు. వాట్స్ అప్ గ్రూప్ అడ్మిన్ గా ఉన్న నయీం అ పోస్ట్ ను వాట్స్ అప్ గ్రూప్ నుండి తొలగించలేకపోయినాడు, వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం కూడా ఇవ్వలేడు కావున అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్‌నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాను చట్ట పరిమితులకు లోబడి వినియోగించాలి తప్ప చట్ట వ్యతిరేకముగా, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధముగా ఎవరైనా ప్రయత్నిస్తే చట్టప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

వ్యవసాయ పనిముట్లకు మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి నిశిత

నవతెలంగాణ-పోతంగల్

ప్రభుత్వం సబ్సిడీపై అందించే పనిముట్లకు మహిళ రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిశిత కోరారు. మండలానికి స్ప్రేయర్లు, రోటేవేటర్, కేజీవీల్, సీడ్‌డ్రిల్, పవర్ టిల్లర్, ఇతరసామగ్రి మండలానికి కేటాయించినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ మహిళా రైతులకు 50శాతం, సాధారణ కేటగిరీ మహిళా రైతులకు 40 శాతం పనిముట్లపై ప్రభుత్వం సబ్సిడీ అందజేయనున్నట్టు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని చింతలూరు గ్రామంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డికి చింతలూర్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగుల గోపి, నాగుల శ్రీనివాస్, బ్రాహ్మణపల్లి జెలంధర్, అరిగెల అభిలాష్, పుప్పాల గంగాధర్, పుప్పాల హన్మాండ్లు, నాగుల లింబాద్రి, గోపిడి చిన్నారెడ్డి, నాగుల శివ ప్రసాద్, గడ్డం వెంకట్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఘనంగా ఉగాది సంబరాలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని బషీరాబాద్‌లో గల ప్రభుత్వ సాంకేతిక కళాశాలలో శనివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలను కట్టి కళాశాల భవనాలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి, ఉగాది పండగ విశిష్టతను కళాశాల సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి, ట్రైనింగ్ అధికారి జి.శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారులు సంతోష్, శాన్వీరా, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదవాడికి అండగా తెలుగుదేశం

- పార్టీ పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదగౌడ్
- ఘనంగా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఆవిర్భావ వేడుకలో నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పార్టీ పుట్టినప్పటి నుంచి ప్రతీ పేదవాడికి అండగా తెలుగుదేశం ఉంటుందని పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదగౌడ్ అన్నారు. శనివారం నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కన్వీనర్ దేగాం యధాగౌడ్ జెండాను ఆవిష్కరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు ఏరియాలలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణలు చేశారు. దుబ్బ చౌరస్తా, నాందేవ్‌వాడ, హమాల్‌వాడీ, వెంగళరావు కాలనీ, గోల్ హనుమాన్, ఎల్లమ్మగుట్ట తదితర ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, జ్యోతి నారాయణ, అంబిక సత్యనారాయణ, దంతల ఆనంద్, కోయడి నరసింహులు, ఎల్లంకి పురుషోత్తం, ఎస్ఆర్ రమేష్, పాసులు రాజు, ఇప్పలపల్లి విష్ణు, వేముల నాగేశ్వరరావు, మల్లారెడ్డి, లవంగ రాజు, స్వామి, గంగోనే రాజేశ్వర్, రవికుమార్ పాటిల్, శేఖర్, రోషిదా, బిందు, లక్ష్మీ యాదవ్, విజయలక్ష్మి, మల్లీశ్వరి, కమలా బాయ్, అజీజ్, రాజేశ్వర్ గుప్తా, మల్లేష్ యాదవ్, జాఫర్, సర్ఫరాజ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కటకం లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్
స్థానిక బాపూజీ వచనాలయం ప్రాంగణంలో కటకం లక్ష్మీనారాయణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రముఖ ఇంజనీర్ శ్రీ కటకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు బాపూజీ వచనాలయ అధ్యక్షులు భక్తవత్సలం (ఢిల్లీ) తెలిపారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి 130 విద్యార్థులకుపైగా భోజన సదుపాయం కల్పించిన కటకం శ్రీనివాస్‌ని అభినందించారు. ఇదివరకు వీరు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని అందులో ప్రముఖంగా పేద మెరిట్ విద్యార్థులను గుర్తించి వారి ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తూ అందులో చాలామట్టుకు ఇంజనీర్లు అలాగే డాక్టర్లు తీర్చడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పాటు అనేక రకాల సేవా కార్యక్రమాలు స్వతహాగా ఫౌండేషన్ తరపున ఏర్పాటు చేయటం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాపూజీ వచనాలయం అధ్యక్షులు భక్తవత్సలం, బాపూజీ వచనాలయ కోశాధికారి గంగాధర్, ప్రతినిధులు మీసాల సుధాకర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ అగ్నీవీర్‌కు ఎంపికైన సీఎస్ఐ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడేట్స్



అగ్నీవీర్‌కు ఎంపికైన ఎన్‌సీసీ క్యాడేట్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ నగరం లోని సి.ఎస్.ఐ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడేట్స్ కె.నితిన్, పి.సాయి తేజ బీఎస్సీ మూడవ సంవత్సరం, కే గణేష్ బిఎ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇటీవల ప్రకటించిన ఆర్మీ అగ్నివీర్ ఫలితాలలో విజయం సాధించి ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ ఎం.రాజేశ్వర్ శనివారం తెలియజేశారు. ఈ విద్యార్థుల ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్ భాగ్య రావు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ క్యాడేట్స్‌ను అభినందనలు తెలియజేశారు. వీరికి ఎన్‌సిసి వివిధ రంగాలలో తర్ఫీదు ఇప్పించుటలో అన్ని విధాలుగా సహాయసాకారాలు అందించిన 12 తెలంగాణ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ విష్ణు పి నయ్యర్‌కు కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యరావు, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ రాజేశ్వర్ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అగ్నివీర్ ఉద్యోగాలలో ఎన్‌సీసీ క్యాండిడేట్స్‌కు 20శాతం రిజర్వేషన్ ఉందని ఎం.రాజేశ్వర్ తెలిపారు.

పడకంటి రాము సేవలకు డాక్టరేట్



పడకంటి రాముకు డాక్టరేట్ అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త, సమాజ సేవకుడు అయిన పడకంటి రాముకు డాక్టరేట్ లభించింది. గత 15 సంవత్సరాల నుంచి దేశవ్యాప్తంగా చేస్తున్న ఎన్నో రకాల నిస్వార్థ సేవాకార్యక్రమాల్ని గుర్తించిన అమెరికాకు సంబంధించిన ప్రముఖ యూనివర్సిటీలలో ఒకటైన జార్జియా యూనివర్సిటీ ఆగ్రాలోని రాడిస్సాన్ హోటల్‌లో జరిగిన కాన్వొకేషన్ ప్రోగ్రాంలో పడకంటి రాముకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి రాము తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరై గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా రాము మీడియాతో మాట్లాడుతూ.. తాను చేసిన సమాజ సేవల్ని గుర్తించి అత్యున్నత డాక్టరేట్ పట్టాను అందించిన యూనివర్సిటీకి తన సేవల్ని ప్రోత్సహిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అభిమానులు మిత్రులకు, కృతజ్ఞతలు, తెలియచేశారు.

ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

నవతెలంగాణ-పోతంగల్
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ ఉపాధ్యాయులు గరుడ్కర్ అశోక్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారము తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.

గోదామ్‌ల నిర్మాణం ఎప్పుడు..?

- నిలదీసిన రైతులు
- రసాభసాగా మాక్లూర్ సహకార సంఘం మహాజన సభ



మహాజన సభలో పలువురిని నిలదీస్తున్న రైతులు



రైతులు పూర్తిస్థాయిలో హాజరుకాకముందే సమావేశం ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని బొంకన్‌పల్లి, మాదాపూర్ గ్రామాల్లో గోదాములు బెసిమిట్‌కే పరిమితం అయ్యాయని, వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని ఆయా గ్రామాల రైతులు చైర్మన్, డైరెక్టర్లను నిలదీశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 86వ మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పడి మంది రైతులు కూడా రాక ముందే సమావేశాన్ని ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి ప్రవీణ్ జమ, ఖర్చులను చదివి వినిపించారు. రైతులు సకాలంలో రుణాలు తీసుకున్నా.. సిబ్బంది రికార్డుల్లో ఆలస్యంగా రాయడంతో తమకు రుణమాఫీ కాలేదని కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి 92 మంది లిస్టును ఉన్నతాధికారులకు పంపించమని 5వ విడతలో రావచ్చని కార్యదర్శి సమాధానం ఇచ్చారు. బొంకన్‌పల్లి, మాదాపూర్ గ్రామాల్లో గోదాం నిర్మాణానికి రెండు సంవత్సరాల క్రితం భూమి పూజ చేసి బేసిమిట్ వరకే పరిమితం అయిందని, దానిని ఎపుడు పూర్తి చేస్తారని ఆయా గ్రామాల రైతులు ప్రశ్నించారు. ఈరెండు గ్రామాల గోదాములపై సుమారు రూ.35లక్షలు డ్రా చేశారని దీనిపై విచారణ కొనసాగుతుందని చైర్మన్, డైరెక్టర్లను సమాధానం ఇచ్చారు. గతంలో సొసైటీ డబ్బులు ఎంత మంది తిన్నారో వారితో అందరితో కట్టించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యవర్గ కమిటీపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, సొసైటీ చైర్మన్ బుర్రోళ్ల అశోక్, వైస్ చైర్మన్ గుండారం శేఖర్, డైరెక్టర్లు గంగోని గంగాధర్, దయాకర్, అశోక్, గంగారాం, సజ్జనాయక్, అసిస్టెంట్ రిజిస్టర్ స్వప్న, మాజీ చైర్మన్ భాస్కర్‌రావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి, ప్లేస్మెంట్ ప్రోగ్రామ్ ఎఫ్‌వై 2024-25 శిక్షణ కోసం ఆహ్వానం

- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఉపాధి, ప్లేస్మెంట్ ప్రోగ్రామ్ ఎఫ్‌వై 2024-25 శిక్షణ కోసం శిక్షణ భాగస్వా ములను ఆహ్వానిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ క్రిస్టియన్ మైనారి టీల ఫైనాన్స్ కార్పొరేషన్, మైనారిటీల సంక్షేమ విభాగం, ట్రైనింగ్ ఎంప్లాయిట్ ప్లేస్మెంట్ ప్రోగ్రాం పథకం ఎన్ఎస్‌డీసీ, టాస్క్, ఈజీఎంఎం, మెప్మా ఎన్ఐ-ఎన్ఎస్ఎన్ఈ, ఎంపానెల్ చేసిన భాగస్వాములను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. డిడియుజికేవై, పిఎంకెవై, పిఎంకెవివై, పిఎంకెకే కేంద్ర ప్రభుత్వ మైనారిటీల వ్యవహారాల మంత్రిత్వ శాఖ శిక్షణ భాగస్వామిగా పరిగణించబడుతుందని తెలిపారు. ఎంచుకున్న శిక్షణా భాగస్వాములు ఎఫ్‌వై-2024-25 కోసం శిక్షణా కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఎండిటీజీ సీఎం ఎఫ్‌సి అండ్ ఎంఒయులోకి ప్రవేశిస్తారని తెలిపారు. విద్యార్థుల సమీకరణ, విద్యార్థుల దరఖాస్తు పరిశీలన బాధ్యత శిక్షణ భాగస్వాములచే తీసుకోవాలని తెలియజేశారు. అర్హత కలిగిన శిక్షణా భాగస్వాములు తేదీ 26-03-2025 నుంచి 31-03-2025 వరకు సాయంత్రం 5 గంటల వరకు ప్రతిపాదనల 2 సెట్లలో హార్డ్ కాపీలను మేనేజింగ్ డైరెక్టర్ ఈజీ సీఎంఎఫ్‌సి హైదరాబాద్‌లో సమర్పించాలని సూచించారు.

ఉగాది వేడుకలకు ముస్తాబైన శ్రీరమా సహిత సత్యనారాయణ ఆలయం

నవతెలంగాణ-ఆర్మూర్
మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విశాఖనగర్‌లో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, పంచముఖ హనుమాన్ ఆలయంలో ఉగాది పర్వదినానికి ముస్తాబైనట్టు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. సాయంత్రం 5:30 గంటలకు శ్రీశ్రీశ్రీ బ్రహ్మశ్రీ బాల్యపల్లి సుబ్బారావు గురు స్వామి ఆధ్వర్యంలో ఉగాది (నూతన సంవత్సర) శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రావణం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ సూర్యోదయ హైస్కూల్‌లో ఉగాది సంబురాలు



నవతెలంగాణ-నందిపేట్
మండల కేంద్రంలోని శ్రీ సూర్యోదయ హైస్కూల్‌లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. తెలుగు నూతన సంవత్సరం ఉగాది పచ్చడితో మొదలవుతుందని హెడ్మాస్టర్ నాగరావు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చంద్రకళ, శిరీష, టీచర్లు పాల్గొన్నారు.

శ్రీ మాధవి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఎడపల్లి
మండల కేంద్రంలోని శ్రీ మాధవి పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు సుమారు 118 రకాల వివిధ వంట రకాలను తయారు చేసుకుని పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురేష్ గౌడ్ మాధవి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఫుడ్ ఫెస్టివల్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఇంట్లో చేసుకున్న వంట భోజనంతోపాటు వివిధ రకాల పిండి వంటలు స్వీట్‌లను తయారు చేసుకుంటే ఇంటి వంటలు ఎంతో రుచికరమైనవిగా ఉంటాయని వివరించారు. ప్రస్తుతం పాఠశాల బాల బాలికలు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన హోటల్లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో అనేక రకాలుగా తయారు చేసిన ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్యం పాలవుతారని ఉపాధ్యాయులు గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'ముందస్తు అడ్మిషన్‌లపై' చర్యలు తీసుకోవాలి

- యూఎస్ఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరం పూర్తి కాకముందే అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను లెక్కచేయ కుండా వ్యవహరించడం జరుగుతుందని అన్నారు. 2024-25 విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ఆయా ప్రైవేట్ స్కూళ్లలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని, అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటన విడుదల చేసినా, ఆ ప్రకటనను ఏమాత్రం పట్టించుకోకుండా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలలు ముందస్తు అడ్మిషన్ల కోసం నిజామాబాద్ నగర కేంద్రంలో గల ప్రధాన కూడలిలో ఆయా ప్రైవేట్ పాఠశాలల బ్యానర్ ఏర్పాటు చేసి, అందులో విద్యార్థుల ఆకర్షించే రకంగా ఫొటోస్ పెట్టి మోసం చేసి అడ్మిషన్లు చేసుకునే రకంగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలు నడుచుకోవాలని, లేకుంటే ఆ ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు అయ్యేంతవరకు పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి సైతం స్పందించి ప్రభుత్వ నిబంధనలను పట్టించు కోకుండా ఉన్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ కమిటీ సభ్యులు సచిన్, రాకేష్, వరదరాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు
సహకార రంగానికి మైలురాయి

- సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు లోక్ సభల ఆమోదం పొందడం సహకార రంగానికి మైలురాయి అని కమ్మర్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్ శనివారం పేర్కొన్నారు. లోక్‌సభలో త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు-2025 ఆమోదం పొందిందని, దీని ద్వారా గుజరాత్‌లోని ఐఆర్ఎంఎ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్) త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయంగా మారుతుందన్నారు. ఇది భారతదేశంలోని మొదటి జాతీయ సహకార విశ్వవిద్యాలయం కాగా, సహకార రంగానికి నైపుణ్యం కలిగిన నిపుణులను తయారు చేయడం దీని లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విశ్వవిద్యాలయం సహకార ఆర్థిక, గ్రామీణ క్రెడిట్, మార్కెటింగ్, పాడి, మత్స్య పరిశ్రమలపై డిగ్రీలు, డిప్లొమాలు, శిక్షణ, పరిశోధనలను అందిస్తుందన్నారు. డిజిటల్ లెర్నింగ్ ద్వారా అందరికీ విద్యను చేరువ చేయనుందని, పాలక మండలిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో పాటు సహకార రంగ ప్రముఖులు ఉంటారని పేర్కొన్నారు. కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్‌షా ఈ బిల్లును ప్రవేశపెట్టారన్నారు. ఈ విశ్వవిద్యాలయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, స్వయం ఉపాధి, ఆవిష్కరణ, సామాజిక చేరికకు సహాయపడుతుందన్నారు. క్రిభికో వంటి సంస్థలు దీన్ని చారిత్రాత్మక ముందడుగుగా ప్రశంసించాయని తెలిపారు. ఇది భారత సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయనుందని దేవేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం



మాట్లాడుతున్న బాధితురాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలం లోని కోనాసముందర్ గ్రామానికి చెందిన ఇబ్రహీంపట్నం భూమేశ్వర్ బతుకు తెరువు, కుటుంబ పోషణ కోసం గల్ఫ్ దేశమైన దుబాయ్ వెళ్లి దురదృష్టవశాత్తు అక్కడే మృతి చెందాడు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తును పరిశీలించిన అధికారులు ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం గల్ఫ్ మృతుడు ఇబ్రహీంపట్నం భూమేశ్వర్ భార్య లావణ్య బ్యాంకు ఖాతాలోకి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సహాయం నిధుల నుంచి రూ.5లక్షలు జమ చేశారు. ఆర్థిక సహాయం నిధులు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు బాధితుని కుటుంబ సభ్యులు తెలిపారు. రూ.ఐదులక్షలు ఆర్థిక సహాయం అందించి, కుటుంబానికి భరోసా కల్పించి బాసటగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమేశ్వర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హలో బీసీ.. చలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ



చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
తెలంగాణ బిసి సంక్షేమ సంఘం 42శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కోసం హలో బిసి ఛలో ఢిల్లీ కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా ఉద్యోగాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేకపోతుల నరేందర్‌గౌడ్ పిలుపుమేరకు ఏప్రిల్ 2న ఢిల్లీ జంతర్ మంతర్ ధర్నా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రం అమలు చేసిన బిల్లును చట్టబద్ధతతో లోకసభలో కూడా అమలు చేయాలని, అన్ని బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అన్నగౌడ్ నారాగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరిమూర్తి, యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఉప్పునూతల రాజాగౌడ్, రాష్ట్ర ఈసీ మెంబర్ కపిల్, బీసీ నాయకులు రాజు, రవి, జైపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాస శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

8 వేల మందికి మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అమావాస్య పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యం మేరకు ఆలయ ఈవో నాయక్ రాములు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యం మేరకు సుమారు 8000 మంది భక్తులకు మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. ఆలయ ఆవరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై వంశీకృష్ణారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జానకంపేట గ్రామ పెద్దలు, నాయకులు ఆలయ జూనియర్ అసిస్టెంట్ రఘు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్
మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 9వ వార్డులో గల నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ బిల్డింగ్‌ను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం హెల్త్ గ్రాంట్స్ నుంచి 1.43 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందించాల్సిందిగా కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాహుల్, చందు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది సంబురాలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఆదర్శ పబ్లిక్ స్కూల్, కేటీఎస్ తదితర స్కూళ్లల్లో ఉగాది పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పండగ పురస్కరించుకొని పాఠశాలలో పచ్చళ్లు తయారు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో ఘనంగా ఉగాది సంబరాలు ఉపాధ్యాయులు విద్యార్థులతో నిర్వహించుకున్నారు.


ఉగాది సంబరాల్లో విద్యార్థులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండల పరిధిలోని పెద్ద టాక్లి గ్రామానికి చెందిన మహమ్మద్ బేగం లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు, గైక్వాడ్ విలాస్, పెద్ద టాక్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు, గొండ హలె హన్మంత రావు, ఆశిప్ దేశాయ్, అబ్దుల్ సాబ్, మహమ్మద్ సాబ్, శాధుల్ సాబ్, యూనస్ పటేల్, జిలాని సాబ్, పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్ఐసి ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు


ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

ఎల్ఐసీలో పాలసీదారులకు విశేష సేవలు అందించి మెదక్ బ్రాంచికి బదిలీ అయిన పి.వెంకటేశం మళ్లీ కామారెడ్డికి రావాలని బ్రాంచి మేనేజర్ కృష్ణమోహన్ ఆకాంక్షించారు. శనివారం సాయంత్రం స్థానిక ఎల్ఐసీ శాఖలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేనేజర్ మాట్లాడుతూ పి.వెంకటేశం సేవలను మరువలేనివని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు పనిచేసే విధంగా ఆయన సేవలు అందించారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంపత్ కుమార్, అనిల్ కుమార్, లియాఫీ నాయకులు టి.మోహన్, నారాయణరావు, ప్రదీప్ జైన్, క్లియా నాయకులు రాజారెడ్డి, అభివృద్ధి అధికారులు మారుతి, క్లాస్ వన్ అధికారులు రాకేష్, శ్రీధర్ తదితరులు సన్మానించారు.

శాలివాహన సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని శాలివాహన సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సంఘం అధ్యక్షునిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా సంగయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

పేదింటి మహిళలకు కళ్యాణలక్ష్మి బాసట


చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-పిట్లం

పేదింటి మహిళలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఓ వరం లాంటివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదింటి మహిళల పెండ్లి సమయాలలో ఎన్నో ఇబ్బందులకు గురై అప్పుల సతమతమయ్యేవారని వారికి చేయూతనివ్వాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక లక్ష 116 రూపాయలను ప్రోత్సాహకంగా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ జయశ్రీ , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ బడికి గ్రంథాలయ సామగ్రి అందజేత


సామగ్రి అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట మండల పరిషత్ పాఠశాలకు శనివారం యునిమనీ ఫైనాన్స్ సర్వీస్ కంపెనీ సౌజన్యంతో, కామారెడ్డి బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ 25 వేల గ్రంథాలయ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజన్న మాట్లాడుతూ.. పుట్టిన ఊరును మరచిపోకుండా స్వగ్రామంలోని పాఠశాలకు తను పనిచేస్తున్న ఫైనాన్షియల్ కంపెనీ ద్వారా పేద విద్యార్థుల చదువు కోసం గ్రంథాలయ సామాగ్రి అందజేసిన బ్రాంచ్ మేనేజర్ బొమ్మెడీ సంతోష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ మేనేజర్ రాజకుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం యూని మనీ నిర్వహించే స్వచ్ఛంద సేవలో భాగంగా మద్దికుంట పాఠశాలకు అందించినట్టు తెలిపారు. మునుముందు యూనిమని ఆధ్వర్యంలో పేద లకు, ప్రభుత్వ పాఠశాలలకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఆర్ ఎచ్ రాజ్ కుమార్, బిహెచ్ బొమ్మిడి సంతోష్ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రాజు, సిబ్బంది రాజేశ్వర్, వీడీసి ఒరగంటి నారాయణ, ఉపాధ్యాయులు శ్రీకాంత్, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లల్లో ఉగాది ఉత్సవాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ప్రాథమిక పాఠశాల అయిలాపూర్‌లో శనివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ సిద్ధాంతి వేషధారణలో అలరించి పంచాంగ శ్రవణం చేశారు. విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో హాజరైయ్యారు. అనంతరం దామోదర్ మాట్లాడుతూ ఇలాంటి వేషధారణలు వేడుకలు వలన మన సంస్కృతి, సంప్రదాయాలను బావితరాలకు అందించవచ్చని అన్నారు. ఉగాది పచ్చడిని సేవించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, శివనంద, లావణ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్ధాంతి వేషధారణలో హెచ్ఎం

జొన్నలు ఎకరాకు 25 క్వింటాళ్లు కొనాలి

- రైతులందరికీ 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలి
- సొసైటీలో తీర్మానం : సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్ రెడ్డి

నవతెలంగాణ-నిజాంసాగర్

జొన్నలను ఎకరాకు 25 క్వింటాళ్లు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసినట్టు మల్లూర్ సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మల్లూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ అధ్యక్షతన సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘ సభ్యుల సహాయ సహకారాలతో సొసైటీ నడిపిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్

సొసైటీ లాభాల బాటలో నడిపించే విధంగా సంఘ సభ్యులు అందరూ వచ్చే సీజన్‌లో ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని సేకరించాలని తెలిపారు. పలువురు రైతులు జొన్న పంటను ఎకరానికి 25 క్వింటాళ్లు తీసుకునేలా అభిప్రాయం వ్యక్తం చేసినందుకు తీర్మానం చేసినట్టు తెలిపారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసే విధంగా తీర్మానం చేసినట్టు సూచించారు. మల్లూర్ సొసైటీ పరిధిలో 2 కొనుగోలు సెంటర్లను ప్రభుత్వం ఐకెపి వారికి అప్పచెప్పిందని, వాటిని తిరిగి సొసైటీ వారికే అప్పచెప్పాలని పలువురు రైతులు డిమాండ్ చేయడంతో దానిపై కూడా తీర్మానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామ్ సింగ్, డైరెక్టర్లు బుడమే గంగాధర్, కొత్తపల్లి విఠల్, సప్పటి నారాయణ, కోటి భూమవ్వ, అడ్డగల భూమేష్, సతేలి అంజయ్య, వెంకట్ రెడ్డి, కిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం పరమళ్ళ, మాలోత్ తండాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చిత్రపటాలకు గిరిజనులు శనివారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు ప్రకాష్ రవీందర్, నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గోరు బోలి (లంబాడా) భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం యూత్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ వికాస్ సంతు సేవాలాల్ మాల ధరించినటువంటి గిరిజనులు పాలాభిషేకం చేశారు. భాషా పరిరక్షణలో మరో కీలక ముందడుగు పడినట్టు అయిందని, ఇది లంబాడా భాషాభిమానులకు గొప్ప గర్వకారణం అన్నారు. ఈ చారిత్రక నిర్ణయాన్ని స్వాగతిస్తూ, భాషా హక్కుల సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ముందడుగు ప్రశంసించారు రాష్ట్రంలో 40 లక్షలు ఈ దేశంలో 15 కోట్ల మంది బంజారాలకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రకాష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్ నాయక్, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ వికాస్, విట్టల్, దశరథ్, లాల్ సింగ్, లక్ష్మణ్, బన్సీ, పవన్, రామావత్ ప్రకాష్, రామ్ సింగ్, బాబు, హరి, పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

కష్టపడే కాంగ్రెస్ కార్యకర్తను కోల్పోయాం

- వెంకట్రావ్ దేశాయి మృతి పట్ల ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు సంతాపం


కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన వెంకట్రవ్ దేశాయి శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు.. నియోజకవర్గ పర్యటనను మధ్యలో ఆపి హుటాహుటిన బస్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి వెంకట్రావ్ దేశాయికు నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుడు వెంకట్రావు దేశాయి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ కష్టపడే తత్వం కలిగిన కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తను కోల్పోయామని తనకు సదా మిత్రుడుగా ఉన్న వెంకట్రావు దేశాయ్ మృతి పట్ల తనకు కలిచివేసిందని అన్నారు. అదేవిధంగా జుక్కల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లాడేగావ్ సతీష్ పటేల్ మాట్లాడుతూ తన గురువుగా భావించే వెంకట్రావు దేశాయ్ మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందని కన్నీరు పర్యంతమయ్యారు.

ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించాలి

- సమయం కంటే ముందే పేపర్‌లు తీసుకున్నట్టు ఆరోపణ


మాట్లాడుతున్న టీజీవీపీ నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూమ్ నెంబర్ 4లో పదో తరగతి పరీక్షలో భాగంగా శనివారం నిర్వహించిన బయో సైన్స్ పరీక్ష సమయం పూర్తి కాకముందే 15 నిమిషాల ముందు విద్యార్థుల నుండి పరీక్ష పేపర్లను లాక్కున్న ఇన్విజిలేటర్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఇన్విజిలేటర్ లను తొలగించకుంటే మండల విద్యా వనరుల అధికారి కార్యాలయాన్ని ముట్టడి స్తామని హెచ్చరించారు. వెంటనే జిల్లా విద్యాధికారి వారిపై చర్యలు తీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ సమీర్, నరేందర్ పాల్గొన్నారు.

31న కుస్తీ పోటీలు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పెద్ద పోతంగల్ గ్రామంలో ఉగాది పురస్కరించుకొని 31న కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా కుస్తీ పోటీలకు మల్లాయోధులు అధిక సంఖ్యలో పాల్గొని కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని గ్రామస్థులు కోరారు.

రైతులకు ఈపాస్ ద్వారా ఎరువులు అమ్మాలి

నవతెలంగాణ-సదాశివనగర్

రైతులకు ఈపాస్ ద్వారా ఎరువుల అమ్మాలని ఏవో ప్రజాపతి సూచించారు. మండలంలోని పలు గోదాంలోని ఎరువులను శనివారం తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు అమ్మకూడదని సూచించారు. స్టాక్ రికార్డు ఉంచాలని తెలిపారు. రైతులకు ఎరువుల వివరాలను బోర్డు పైన రాయాలన్నారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. గోదాంలోని ఎరువులను చూచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కుప్రియాల్ గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ, పద్మాజి వాడి సదాశివనగర్ గోదాంలను పరిశీలించినట్టు తెలిపారు.


ఎరువుల గోదాంను తనిఖీ చేస్తున్న ఏవో

ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డి పేట్ మండలంలోని అచ్చయ్య పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను శనివారం రోజు ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణం జరిగిన కొద్దీ నిధులు వస్తాయని ఆయన తెలిపారు. ఆయన వెంట ఈసీ సాయిలు ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఐఐటీ, నీట్, ఒలింపియాడ్ ఫౌండేషన్ పోటీల్లో ఆర్కిడ్స్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

- చైర్మన్, ప్రిన్సిపాల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి



అవార్డు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్కిడ్స్ హై స్కూల్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను నిరూపించుకుని, ఐఐటీ, నీట్, ఒలింపియాడ్ ఫౌండేషన్ పోటీల్లో విశేష విజయాలను సాధించారనీ పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి శనివారం తెలిపారు. ఏకలవ్య అకాడమీ వార్షిక స్కూల్ అవార్డ్స్ మాదాపూర్, హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్కిడ్స్ హై స్కూల్ విద్యార్థులు అపూర్వమైన ఘనతను సాధించారన్నారు. డి, సహస్ర (7వ తరగతి) డి, యోగిత (4వ తరగతి) రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించి, తమ పాఠశాలకు గర్వకారణంగా నిలిచారన్నారు. అదనంగా, ఆర్. తమన్న (6వ తరగతి), జి. ప్రగ్నశ్రీ (9వ తరగతి), పి. సాయికృష్ణ ప్రియ (8వ తరగతి) మెడల్స్ గెలుచుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డులను స్వామి బోధామయా నంద, అధ్యక్ష మహారాజ్, రామకృష్ణ మఠం, విజయ్ రంగినేని (మాజీ సీఈఓ, టెక్ మహీంద్రా బీపీఓ)గార్లు అందజేసి, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించినట్టు తెలిపారు. ఈ సందర్భంలో పాఠశాల చైర్మన్ తో పాటు డైరెక్టర్ మర్రి సదాశివరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషిని అభినందించారు. నాణ్యతమైన విద్యను అందిస్తూ, విద్యార్థులను అకాడమిక్, పోటీ పరీక్షల విజయానికి ప్రోత్సహిస్తూ, ఆర్కిడ్స్ హై స్కూల్ విద్యారంగంలో కొత్త రికార్డులను నెలకొల్పుతోంద న్నారు. ఆర్కిడ్స్ హై స్కూల్ భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దుతున్న సంస్థ అన్నారు.

భర్తను హత్య చేసిన భార్య

నవతెలంగాణ-బీర్కూర్ (నసురుల్లాబాద్)

భర్తను భార్య హత్య చేసిన ఘటన బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీ ఓసులు.. స్థానికుల వివరాల ప్రకారం.. సోమేశ్వరం గ్రామానికి చెందిన అమృతం విఠల్ (42).. నాగారం గ్రామానికి చెందిన మేనమామ కూతురు కాశామణిని 20 ఏండ్ల క్రితం పెండ్లి చేసుకొని ఇల్లరికం వచ్చి ఉంటున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు. కాగా భార్య వివాహేతర సంబంధం పెట్టుకోవ డంతో విషయం తెలుసుకున్న భర్త మందలించాడు. విఠల్‌తో ప్రమాదం ఉందని భావించిన భార్య ఆయన్ను చంపాలని భావించి.. అదే గ్రామానికి చెం దిన కొందరితో కలసి ఉరి వేసి హత్య చేసి, బీర్కూరు మండలం దామరంచ శివారులో రోడ్డుపై విఠల్ మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. తన అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని కాశామని తన భర్తను కొందరితో కలిసి హత్య చేసిందని మృతుడి తమ్ముడు సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



నీటిని పొదుపుగా వాడుకోండి

- మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

నీరు ఉంటేనే ఏదైనా సజీవంగా ఉంటుందిని, నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాన్సువాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చలివేంద్రంను ప్రజలు సద్వినియోగించుకోవాలని, తాగునీరుని వృథా చేయకూడదన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ఎండల వేడి ఎక్కువ అవుతున్నందున పాదాచారులకు వాహనదారులకు దప్పిక తీర్చేందుకు తమ వంతు బాధ్యతగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీరి వెంట సతీష్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



చలివేంద్రం ప్రారంభం

సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న రిటైర్డ్ డీజీఎం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో నిర్మిస్తున్న సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి చిన్న గుజ్జుల్ తండాకు చెందిన రిటైర్డ్ డీజీఎం నేనావత్ దేవి సింగ్ తనవంతు సహాయంగా రూ.25,021 విరాళంగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రేమ్, మోజీరామ్ నాయక్, హెం సింగ్ నాయక్ తదితరులు ఉన్నారు.

టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-తాడ్వాయి

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు శనివారం ఎల్లారెడ్డి నియోజకవర్గ టిడిపి నాయకులు కమ్మరి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణజివాడి గ్రామంలో బస్టాండ్ ప్రాంతంలో గల నందమూరి తారక రావు విగ్రహానికి పూలమాలవేసి టిడిపి జెండా ఆవిష్కరించారు. తెలుగు ప్రజలను రాజకీయ సామాజిక ఆర్థిక అంశాల్లో ముందుకు తీసుకొచ్చింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో సైతం మున్ముందు ప్రధాన ప్రతిపక్ష పార్టీగా టిడిపి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బీర్ల దత్తయ్య, కమ్మరి రాజేష్, తెలుగు నర్సింలు, బాలయ్య, సాయిలు, రాములు, తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి ఒలంపియాడ్, ఐఐటి పరీక్షలలో ఇన్‌స్పైర్ బ్రిడ్జ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని సర్వాపూర్ గ్రామంలో గల ఇన్‌స్పైర్ బ్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన ఏకలవ్య ఒలంపియాడ్, ఐఐటి పరీక్షలలో ఇన్‌స్పైర్ బ్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచినట్టు ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌గౌడ్ తెలిపారు. మారుమూల ప్రాంత విద్యార్థులు ఒలంపియాడ్, ఐఐటి పరీక్షలలో ప్రతిభ కనబరచడం మన ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఐఐటి విజేతలకు రామకృష్ణ మఠ్ అధ్యక్షులు బోధమాయనంద జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ వినయ్ సాయికుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

నిజామాబాద్

ఆదివారం | మార్చి 30, 2025 | www.navatelangana.com

ఎన్నికలపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్



క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో వన్ నేషన్, వన్ ఎలక్షన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనేది భారతదేశంలో పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదన ప్రస్తుతం, భారతదేశంలో లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరు సమయాల్లో జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల రాజకీయ అస్థిరత, అధిక వ్యయం, పరిపాలనా సమస్యలు వస్తున్నాయని భావిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్కే పాండే, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నవతెలంగాణ-ఆర్మూర్



విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, వారి ఎదుగుదలకు కృషిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు జంగం అశోక్ సేవలు వెలకట్టలేనివని పిఆర్‌టియు, యూటీఎఫ్ నాయకులు అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ గ్రామ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం జంగం అశోక్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, సత్యానంద్, సాయన్న, గోపి, రవీన్, ఉపాధ్యాయ బృందం, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాల్కొండ వార సంత రూ.4.80లక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతకు శనివారం ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. 2025-2026సంవత్సరానికి గానూ వార సంత వేలాన్ని రూ.4,80,000కు మొహమ్మద్ మోయిజుద్దీన్ దక్కించుకున్నారని గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

గోరు బోలి భాషను రాజ్యాంగంలో ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం పట్ల హర్షం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

గోరు బోలి భాషను రాజ్యాంగంలో ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని శాసనసభ శుక్రవారం తీర్మానం చేయడం పట్ల మండలంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ తేజవత్ బిలియన్ నాయకులు గత కొన్ని రోజులుగా దేశ మొత్తంలో బంజర మాతృభాష అయిన గోరుబోలి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో గోర్ బోలి భాషను తీర్మానం చేశారు. దీంతో నిజామాబాద్ గిరిజన బంజారాల తరఫున, భీంగల్ మండల బంజర తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ తేజవత్ బిలియన్ నాయక్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ల చిత్రపటానికి గిరిజన నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రమేష్ నాయక్, భీంగల్ మండల లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు సేవాలాల్ నాయక్, లంబడి హక్కుల పోరాట సమితి బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ కే వలి నాయక్, బంజరా సీనియర్ నాయకులు మలావత్ సంగ్య తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్‌లో ఎన్ఆర్ఈజీఎస్ కింద సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. రెండు లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ పనులను నాణ్యతతో చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలాధ్యక్షురాలు ఎన్విరా దేవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సగ్గు వెంకటి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, గైని సాయిలు, శ్రీనివాస్, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- బీసీ సెల్ పట్టణాధ్యక్షులు దొండి రమణ

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ శనివారం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు రాజీవ్ యువ వికాసం పేరిట సరికొత్త పథకాన్ని తీసుకువచ్చిందని అన్నారు. యువతను ప్రోత్సహించి వారి కాళ్లపై వారు నిలబడేందుకు అవసరమైన రుణాలను ఈ రాజీవ్ వికాసం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని దొండి రమణ సూచించారు. అర్హులైన వారికి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా రుణాలను మంజూరు చేయనున్నట్టు వివరించారు. రూ.50 వేల లోపు రుణం తీసుకుంటే 100 శాతం సబ్సిడి, రూ.లక్ష లోపు రుణం తీసుకుంటే 90 వేలు (10శాతం) మాఫీ, రూ.2 లక్షల లోపు తీసుకుంటే రూ.60 వేలు (20శాతం) మాఫీ, గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం రూ.1.50 లక్షలు, అర్బన్ ఏరియాలో వారి ఆదాయం రూ.2 లక్షలు, వ్యవసాయేతర యూనిట్లకు 21-55 ఏండ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. వ్యవసాయం దరఖాస్తుదారులకు 60 ఏండ్ల లోపు వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట సమీపంలోని పెద్ద వాగు దగ్గర గల మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్ శనివారం తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం నుండి వారం రోజులపాటు జాతర ఉత్సవాలు జరుగుతాయన్నారు. సోమవారం ఉగాది పర్వదినాన ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం అమ్మవారి ఊరేగింపుతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, బుధవారం ఉదయం రథోత్సవం మధ్యాహ్నం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. వారం రోజులపాటు అమ్మ వారి దగ్గర జాతర ఉత్సవాలు కొనసాగుతాయని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

నవతెలంగాణ-తాడ్వాయి

ఉగాది ఉత్సవాలకు తాడ్వాయి గ్రామ శివారులో గల ఆలయాలు ముస్తాబు చేశారు. గ్రామ శివారు లో గల ఆలయాలను రకరకాల రంగులతో విద్యుత్ బల్బులతో అలంకరించారు. నేడు జరిగే ఉగాది ఉత్సవాలకు రైతులు అలంకరించిన ఎడ్లబండ్లతో గ్రామ దేవతల చుట్టూ ప్రదక్షిణ చేయించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు తాడ్వాయి, దేవయిపల్లి, బ్రహ్మాజీ వాడి, చిట్యాల, సోమారం, తదితర గ్రామాల ప్రజలు హాజరవుతారని తెలిపారు. ఉత్సవాలు గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, గ్రామ పెద్ద లు, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాధారణ డెలివరీలు అయ్యేలా చూడాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఓ తుకారం రాథోడ్

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్‌లో సాధారణ డెలివరీలు అయ్యేలా చూడాలని ఆసుపత్రి సిబ్బందికి డిప్యూటీ డిఎంహెచ్ఓ, మలేరియా జిల్లా అధికారి తుకారం రాథోడ్ సూచించారు. ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని ఎంపీడీవో నాగ్‌నాథ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో సాధారణ డెలివరీలు అయ్యేలా చూడాలని రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి రెండు లక్షల 25 వేలు బడ్జెట్ రాగా సుమారు మూడు లక్షల వరకు అవసరాలు ఉన్నందున మొదట ప్రధానమైన అవసరాలకు బడ్జెట్‌ను వాడనున్నట్టు తెలిపారు. ఆసుపత్రిలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, కంప్యూటర్ తదితర సామగ్రి మరమ్మతులు చేయించనున్నట్టు తెలిపారు. బినోల పిహెచ్‌సికి రూ.62,000 మంజూరు అయ్యాయని వాటి అవసరాలకు వినియోగించేందుకు ఆమోదించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో కుక్క, పాము, కోతి కాటులకు మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు మధ్యాహ్నం ఒంటి గంట కంటే ముందే పనులు పూర్తి చేసుకోవాలని అవసరానికి సరిపడా ఓఆర్ఎస్ సిద్ధంగా ఉందని అన్నారు. గ్రామాలలో దోమల నివారణకు గ్రామ పెద్దలు కృషి చేయాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే అనేక రోగాలు దూరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరమణ, శ్వాసకోశ వ్యాధి నిపుణులు బల్వీర్ సింగ్, వైద్యులు నవ్య కావ్య, కిషన్, వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఓ తుకారం రాథోడ్

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద రాజకీయాలను ఎండగడదాం
- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే రమ

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

మతసామరస్యాన్ని కాపాడుకుందామని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద రాజకీయాలను ఎండగడదామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే రమ అన్నారు. శనివారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా నిజామాబాద్ అర్బన్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని కోటగల్లిలో గల పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. ముందుగా సుత్తి, కొడవలి జెండాను జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కే రమ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మతం పేరుతో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆదివాసీలపై, దళితులపై, మైనారిటీలపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ దేశంలో పతనమవుతున్నదన్నారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. శాసనసభ ఎన్నికల తర్వాత తెలంగాణలో ప్రజల మధ్య మతపరమైన విభేదాలు పెంచేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. మెజార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని వివరించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా అవకాశవాద వైఖరితో ఉంటున్నదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ బిజెపి విభజన రాజకీయాల ప్రమాదాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలోని వామపక్ష పార్టీలు కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేయడానికి, మతసామరస్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, లౌకికత్వం, సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ గడ్డమీద మతోన్మాదానికి చోటు లేదని చాటి చెప్పాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజం మీద ఉందన్నారు. ఆ వైపుగా ప్రజలను మరింత చైతన్యం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

నిజామాబాద్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా వనమాల కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక..

నిజామాబాద్ అర్బన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా వనమాల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు కే.గంగాధర్, బి.మల్లేష్, ఏ.రవీందర్, సీ.హెచ్ సాయన్న, డి.కిషన్, బి.మురళి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలి

- మున్సిపల్ కమిషనర్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ప్రజలు కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గా ప్రార్థన స్థలాన్ని అంజుమాన్ కమిటీ సభ్యులతో కలిసి శనివారం పరిశీలించారు. రంజాన్ పండగ అనేది ఒక ముస్లిం సోదర వర్గానికి సంబంధించింది కాదని.. భీంగల్ ప్రజలు కులమతాలకు అతీతంగా అందరూ సమానమేనని, అందరి పండగలు ఒకటేనని, ఒకరికొకరు గౌరవించుకోవాలని ఆయన సూచించారు. ఈద్గా వద్ద రంజాన్ పండుగ పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈద్గా దగ్గర టెంట్లు, మంచినీటి సౌకర్యం, సౌండ్ సిస్టం, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈద్గా వద్ద శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయాలని ఆదేశించారు. అక్కడ జరుగుతున్న శానిటేషన్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఫీజులను తగ్గించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజులను తగ్గించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఛాంబర్ ముందు శనివారం పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదివే గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో పరీక్షల ఫీజులు ఇష్టారీతిన పెంచడం సరైంది కాదని, ఎక్కువగా ఫీజులు నిర్ణయించడం వలన విద్యార్థులు కొందరు అప్పులు చేసి కడుతున్నారని, మరికొందరు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని వివరించారు. ఒక్కొక్క బ్యాక్‌లాగ్ సబ్జెక్టుకు 700 రూపాయలు తీసుకుంటున్నారని, రెగ్యులర్ పరీక్షల సెమిస్టర్ ఫీజులు 1400 నుంచి 1600 వరకు వసూలు చేస్తున్నారని, ఫీజుల విషయంలో కాకతీయ యూనివర్సిటీకి మన యూనివర్సిటీకి వ్యత్యాసం చాలా ఉందని, ఫీజుల నిర్ణయించే అధికారం గిరిరాజ్ కళాశాలకు ఉందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధిక మొత్తంలో ఫీజుల వసూలు చేయడం సరైనది కాదని తెలిపారు. బ్యాక్‌లాగ్, రెగ్యులర్ ఫీజులను వెంటనే తగ్గించాలని, పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఫీజుల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఎగ్జామ్ ఫీజు తేదీని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు మనోజ్, విజయ్, సురేష్, జీవన్, వివేక్, డానియల్, కాశిఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

ఏప్రిల్ 2న జంతర్ మంతర్‌లో ధర్నాను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏప్రిల్ 2న జంతర్ మంతర్‌లో ధర్నాను విజయవంతం చేద్దామని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అన్నగౌడ్ నారాగౌడ్ అన్నారు. విద్యా ఉద్యోగాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేకపోతుల నరేందర్‌గౌడ్ పిలుపు మేరకు ఏప్రిల్ 2న ఢిల్లీ జంతర్ మంతర్, ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన బిల్లును, చట్టబద్ధతతో లోక్‌సభలో అమలు చేయాలని, అన్ని బీసీ సంఘాలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అన్నగౌడ్ నారాగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, శ్యామ్, యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఉప్పునూతల రాజాగౌడ్, రాష్ట్ర ఈసీ మెంబర్, కపిల్, బీసీ నాయకులు రాజు, రవి, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

కోరట్‌పల్లి జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ గంగాధర్, నాయకులు

డిచ్‌పల్లి మండలంలోని కోరట్‌పల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొలసాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ జాహుర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరికంటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ జహూర్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ భవనం నిర్మాణం కోసం రూ.20 లక్షల ప్రత్యేక నిధులను కేటాయించిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఏర్పడి ఏండ్లు గడుస్తున్నా పాత భవనంలోనే పాలన కొనసాగిందని పేర్కొన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేసే విధంగా చూడాలని నాయకులకు, కార్యకర్తలకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రామ్ చందర్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ షాదుల్లా, గంగారెడ్డి, సురసానీ సాయిరెడ్డి, గుర్రపు గంగారం, చిన్నరెడ్డి, ఊసన్న, బైరి మోహన్, దిలీప్, ప్రవీణ్, బైరి ప్రభాకర్, సురసాని రాజ్ పండరి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని అందజేసిన కాంగ్రెస్ నాయకులు




ఎల్ఓసీని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి తొర్లికొండ గ్రామానికి చెందిన షర్ఫుద్దీన్ నిమ్స్ హాస్పిటల్లో ఆపరేషన్ నిమిత్తం రూ.4,50,000 ఎల్ఓసి అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ తదితరులు ఉన్నారు.

వర్సిటీలో ఘనంగా ఉగాది ఉత్సవం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగా కిషన్ పాల్గొని మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సమయపాలన పాటించడం నేర్పుతుందని, ఇదే కాకుండా అనేక సేవ కార్యక్రమాలు చేస్తుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
6
ఆదివారం | మార్చి 30, 2025 | www.navatelangana.com

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌హెచ్ఓ రఘుపతి శనివారం తెలిపారు. ఎస్‌హెచ్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 24న రాత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో లిఫ్ట్ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో కింద పడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న డాక్టర్లు వచ్చి పరిశీలించగా మృతి చెందినట్టుగా నిర్ధారించారు. అతడిని లేబర్ పని చేసుకునే వ్యక్తిగా గుర్తించారు. ఆయన వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చునని పోలీసులు భావిస్తున్నారు. నలుపు రంగు షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించాడు. ఇతనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712659714కు సంప్రదించాలని పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఇస్సపల్లి గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా తాటికొండ సింహాచారి, కార్యదర్శిగా పి.భరత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నరసయ్య, సంతోష్, రవి, మూర్తి, శ్రీనివాస్, లింబాద్రి, సంజీవ్, నాగేంద్రబాబు, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆశల ఉగాది..

- శ్రీ విశ్వ వాసునామ సంవత్సరానికి స్వాగతం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలుగు సంవత్సరాది నేడు ఉగాది చైత్ర శుద్ధ పాడ్యమి రోజు నుంచి నూతన తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది. చంద్ర మాసం పాటిస్తూ ఈ పండగను జరుపుకుంటారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి పంచాంగ శ్రవణం, జాతక విశేషాలతో ఉగాది పర్వదినం ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకోనున్నారు. శ్రీ విశ్వవాసు నామ సంవత్సరం కొత్తదనాన్ని తీసుకురావడమే కాకుండా సమాజంలోనూ అందరి జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసి కోటి కోర్కెలు పువ్వులై విరబూయాలని ఎదురుచూసే పండగ ఉగాది.

పల్లెల్లో ఉత్సాహంగా..

ఉగాది తెలుగువారింట ప్రత్యేక పండగ. పల్లెల్లో ఉత్సాహంగా జరుపుకుంటారు. ఊరి దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. కొన్ని గ్రామాల్లో ఎడ్లను సైతం అలంకరించి, పలు ప్రత్యేకమైన వంటకాలు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో సాగు పనులు లాంఛనంగా మొదలుపెడతారు. ముఖ్యంగా ఉగాది పచ్చడి తొమ్మిది రుచులు వచ్చేలా చేస్తారు. పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.





నేడు విశ్వ వాసు నామ సంవత్సర ఉగాది..

తెలుగు నూతన సంవత్సర ఆరంభానికి ప్రతీక ఉగాది. చైత్ర శుద్ధ బహుళ పాడ్యమి రోజు వస్తుంది. తెలుగు వారికి నూతన సంవత్సరం ప్రారంభమని చెప్పుకోవచ్చు. ఉగాది రోజు గ్రామాల్లో పంచాంగ శ్రావణం చెప్పడం ఒక ఆనవాయితీ. సాయంత్రం పూట గ్రామ చెవిడి లేదా సంఘం భవనాల యందు పురోహితులు రాశి ఫలాలు చెప్పుతారు. గ్రామ దేవతలకు పూజలు చేస్తారు.

విశ్వబ్రాహ్మణుల పండగ..

ఉగాది పండగ ప్రత్యేకంగా విశ్వబ్రాహ్మణుల పండగగా చెప్పవచ్చు. విశ్వ బ్రాహ్మణులైన స్వర్ణాకార, వడ్రంగి, కమ్మరి, కంచారి, శిల్పి కులస్తుల ప్రత్యేక పండగ. వారు ఉపయోగించే పనిముట్లను భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఉగాది పండగలలో ప్రత్యేకమైనది పచ్చడి.. ఈ పచ్చడి తయారీకి బెల్లం, వేపపూత, కొత్త మామిడి, చింతపండు, ఉప్పు, ఒమ మొదలైన వాటితో తయారు చేస్తారు. కొత్తగా వ్యాపారస్తులు తమ ఖాతాలను ప్రారంభిస్తారు. మరికొన్ని చోట్ల మల్ల యుద్ధం, కుస్తీ పోటీలు సైతం నిర్వహిస్తారు.

నేడు పెర్కిట్ కుక్కల గుట్ట జాతర..

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కల గుట్ట జాతర ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. పట్టణ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ఈ జాతరలో పాల్గొంటారు. వీడీసీ ఆధ్వర్యంలో గుడి పునర్నిర్మాణ పనులు సైతం చురుగ్గా నిర్వహిస్తున్నారు.

ముందు తరాలకు నేర్పించే బాధ్యత పెద్ద వాళ్ళదే..



తెలుగువారి తొలి పండగ ముఖ్యంగా విశ్వబ్రాహ్మణుల పండుగ ఉగాది. ఇంట్లో పిల్లలకు వేపపూత, మామిడి కాయలు, చెరుకు గడలు తీసుకురావాలని పిల్లలకు చెప్పే క్రమంలో పండగలు అర్థమయ్యేవి. ఆ విధంగా మా ముందు తరం వాళ్లు మాకు నేర్పించారు. కొత్త తరానికి మనం అలా నేర్పిస్తే వాళ్లు పాటిస్తారు. సంస్కృతి సంప్రదాయాలను నేర్పించే బాధ్యత పెద్ద వాళ్ళదే.

- శ్రీరామ్ కిషన్, బాలాజీ జ్యువెలర్స్, ఆర్మూర్.

ప్రకృతి పండుగ ఉగాది..



తెలుగువారింట ప్రత్యేక పండగ ఉగాది. పల్లెలతో పాటు పట్టణాలలో సైతం ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ప్రత్యేకమైన వంటకాలతో ఈరోజు తినే ఆహారంలో ఎన్నో పోషకాలుంటాయి. శ్రీ విశ్వ వాసు నామ సంవత్సరం కొత్తదనాన్ని తీసుకురావడమే కాకుండా సమాజంలోనూ అందరి జీవితాల్లోనూ కొత్త ఆశలు చిగురింపచేయాలి. ఉగాది పచ్చడి విశిష్టత, ముందుతరాలు మర్చిపోకుండా చూసుకోవలసిన బాధ్యత పెద్దలదే.

- సాయి కృష్ణారెడ్డి, పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో పాండురంగ ఫంక్షన్ హాల్‌లో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. చిన్న తనం నుంచే విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్ నుంచి దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు, మెడల్స్ అందించి సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భాను చందర్, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

మాతా శిశు సంక్షేమ ఆస్పత్రికి బడ్జెట్ కేటాయించి పనులను పూర్తి చేయాలి

- సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ కంఠేశ్వర్



మాతా శిశు సంక్షేమ ఆస్పత్రికి బడ్జెట్ కేటాయించి పనులను పూర్తి చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ హయాంలో మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి కోట్ల డబ్బులు ఖర్చు పెట్టి అద్దాలమేడ కట్టినట్టు కట్టారని.. మేడిపండు చూడు మేలిమై యుండును పొట్ట విప్పి చూడు పురుగులుండు, పైన పటారంలోన లొటారం అన్నట్టు ఉందని, ఇప్పటికీ పనులు పూర్తికాలేవని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆదరబాదరగా ఓపెనింగ్ చేశారని విమర్శించారు. ఇప్పటికీ అక్కడ డాక్టర్లు, సదుపాయాలు, సిబ్బంది, స్కానింగ్, ఎక్స్‌రే, ల్యాబ్స్ లేవని తెలిపారు. ఎవరికోసం ఓపెనింగ్ చేసినట్టు ప్రజల కోసమేనా..? ఓపెనింగ్ చేసినమని చెప్పుకోడానికా..? అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా నిజామాబాద్ జిల్లా మాతా శిశుసంక్షేమ ఆస్పత్రికి బడ్జెట్ కేటాయించి పనులను పూర్తి చేసి, డాక్టర్లను సిబ్బందిని, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బోచ్కర్ ఓం ప్రకాశ్‌కు పద్య ప్రతిభారత్న పురస్కారం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, పద్య కోకిల, అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాశ్‌కు అవధాన-సాహితీ రంగంలో చేస్తున్న కృషికి గానూ హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలలో పద్య ప్రతిభారత్న విశిష్ట అవధాన సాహితీ పురస్కారం అందజేస్తున్నట్టు అష్టావధాని బోచ్కర్ ఓం ప్రకాశ్ శనివారం తెలిపారు. ఈ విషయాన్ని సంఘ సాంస్కృతిక కార్యదర్శి శ్రీపుత్ర స్వామి తెలిపినట్టు ఆయన వివరించారు. ఈ మధ్యనే ఓం ప్రకాశ్ రచించిన మూడు గ్రంథాలను విశ్వవిఖ్యాత నటులు, దర్శకులు, ఆధ్యాత్మికవేత్త తనికెళ్ల భరణి ఆర్మూర్‌కు విచ్చేసి ఆవిష్కరించారు. ఓం ప్రకాశ్‌కు పద్య ప్రతిభారత్న విశిష్ట అవగాహన సాహితీ పురస్కారం రావడం పట్ల జిల్లా సాహితీవేత్తలు, కవులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం రావడం తనకు ఆనందంగా ఉందని మరింత బాధ్యత పెరిగిందని పద్య సాహిత్యానికి ఎనలేని కృషి చేస్తానని తెలిపారు.

సీపీని కలిసిన సాధన కోఆర్డినేటర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను సాధన కోఆర్డినేటర్ మధుసూదన్ శనివారం కలిశారు. కార్యక్రమంలో ఆక్సిస్టు జస్టిస్ అండ్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సుప్రీంకోర్టులో సాధించిన విజయాల సమాచారం బుక్స్‌ను కమిషనర్‌కు అందజేశారు. అదేవిధంగా సాధన సంస్థ చైల్డ్ లేబర్ పైన, బాల్యవివాహాలు నివారణ అంశంపైన, చైల్డ్ ట్రాఫికింగ్, చైల్డ్ సెక్సువలాబ్యూస్, అంశాలపైన పనిచేయనున్నట్టు వివరించారు.

విద్యార్థులకు బ్యాగులు, సోలార్ లైట్లు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పడంపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, సోలార్ లైట్లు యూత్ ఫోరం సభ్యులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ ఫోరం సభ్యులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో దాదాపుగా 90శాతం పేద విద్యార్థులే విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు చేయూతని అందించెందుకు మార్పు ఫౌండేషన్ ముందుకు వచ్చి పేద విద్యార్థులకు సాహయ సహకారాలు అందించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. వృద్ధులు, వికలాంగులు, అనాథలకు సహయ సహకారాలు అందిస్తామని మార్పు ఫౌండేషన్ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో పరమేష్ యాదవ్, భీమ్రావ్, లింగం, పావుడే బస్వంత్, జీపి సెక్రెటరీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఫిర్యాదు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని కోమటిపల్లి గ్రామ సమీపంలోని ఆదిపరాశక్తి అల్లూరమ్మ సమీపంలో గల భూమిని కొందరు కబ్జా చేశారని.. చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు శనివారం ఎమ్మార్వో సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయ సమీపంలో ఇప్పటికే గ్రామ పంచాయతీ పరిధిలో మినీ పార్క్ ఏర్పాటు చేశామన్నారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశామని ప్రతి ఏటా రైతులు ఖరీఫ్ యాసంగిలో ధాన్యం ఆరబెట్టుకునేందుకు లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో భూమిని చదును చేసి ఐదు సంవత్సరాల నుండి రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారన్నారు. కావాలనే కోమటిపల్లి గ్రామానికి చెందిన ఒకరు దౌర్జన్యంగా భూమిని కబ్జా చేశారని వెంటనే సర్వే నిర్వహించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎంఆర్‌ఓకి ఇచ్చిన వినతి పత్రం పేర్కొన్నారు అదేవిధంగా లింగంపేట ఎస్సై కి ఫిర్యాదు చేశారు.

రాబోయే తరానికి వృక్షాలు.. మొక్కలే



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

నర్సరీల్లో మొక్కల పెంపకం వలన మహా వృక్షాలుగా మారి రాబోయే తరానికి ఉపయోగంలోకి వస్తాయని ఎంపిడిఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని లొంగన్ గ్రామంలో నర్సరీల పెంపకాన్ని ఎంపీడీవో, జిపి కార్యదర్శి అనురాధతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాలకు రోడ్ల వెంబడి ఇరువైపులా మొక్కలను నాటాలని, వాటికి నీరు పోసి సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం నిత్యజీవితంలో ఆనవాయితీగా చేసుకోవాలని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. చెట్లను నరకకుండా వాటిని పెంచడం నేర్చుకోవాలని హితవు పలికారు. అంతకుముందు గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎంపీడీవో పరిశీలించారు. లొంగన్ గ్రామంలో తిరుగుతూ నూతనంగా వేసిన సీసీ రోడ్డు పనులను నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఈసీ స్వామిదాస్, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

మత్తడి పోచమ్మ జాతరకు భారీ బందోబస్తు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల సమీపంలోని పెద్ద వాగు వద్దగల మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ అన్నారు. శనివారం లింగంపేట గ్రామ సమీపంలోని మత్తడి పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన తదిత అంశాలను ఆలయ కమిటీ చైర్మన్ కార్యవర్గ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులపాటు జరిగే జాతర ఉత్సవంలో భాగంగా కార్యక్రమా లను అడిగి తెలుసుకున్నారు. మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులు పోలీసులకు సహకరించాలన్నారు. ఘర్షణలు గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళలో సైతం బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆలయ కమిటీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, ఆర్ఐ కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మారుతి, బొల్లారం క్రాంతి కుమార్, కిరణ్, నగేష్ తదితరులు ఉన్నారు.

ఏప్రిల్ 3న మహనీయుల విగ్రహాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రంలో ఏప్రిల్ మూడో తారీఖున మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమం మౌర్య అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, అతిథిగా ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతమ్, ప్రధాన వక్తగా ఓయూ ప్రొఫెసర్ కాశీం విచ్చేస్తున్నట్టు తెలిపారు. కరావున ఎల్లారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి ఎస్సీ ఎస్టీ బీసీ ఓసి బహుజన నాయకులు అంబేద్కర్ సంఘాల నాయకులు మేధావులు అన్ని కుల సంఘాల నాయకులకు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం మహనీయులు జ్యోతిరావు పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం ఆయన ఇచ్చినటువంటి హక్కుల పట్ల అవగాహన వారి జీవిత త్యాగాలను తెలుసుకొని మహనీయుల విగ్రహ ఆవిష్కరణ విజయవంతంగా చేయడానికి ప్రతి ఒక్కరూ రావాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని చందాపూర్, సంగోజు వాడి, గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం సిఎంఆర్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని శివాజీ తెలిపారు. అనారోగ్యాలతో ఆసుపత్రుల్లో చికిత్స లు పొంది ఇండ్లకు వచ్చిన బాధిత కుటుంబాలు అప్పుల బారిన పడకుండా ఉండేందుకోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ వు చొరవతో అందించిన చెక్కులను అందజేసినట్టు తెలిపారు. చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతాజి గారి సుధాకర్ రావు, మేకల రాజు, మహమ్మద్ షౌకత్, రాఘవేందర్ గౌడ్, టి మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాజేందర్, శ్రీకాంత్, మండల యూత్ అధ్యక్షులు అఖిల్ రావు, లింగం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులున్నారు.

భూమిని కాజేయాలనే కుట్ర

- మల్లారం పేద రైతులకు న్యాయం చేయాలి
- నుడా చైర్మన్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, బాధితులు

కొందరు పేద రైతుల భూమిని కాజేయాలనే కుట్ర పన్నుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్లారం పేద రైతుల సమస్యలపై నుడా చైర్మన్ కేశ వేణును కలిశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రకాంత్, శేఖర్, బాధితులు గంగారాం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని 423/28 సర్వేనెంబరులో గత 60 సంవత్సరాలపైగా ఆ గ్రామ నివాసులు గుండుబద్ద గంగారాం, గుండుబద్ద శ్రీనివాసులు వ్యవసాయం చేసుకుంటున్నారని, రెండు మూడు సంవత్సరాల క్రితం నుంచి మల్లారం గ్రామానికి సంబంధం లేని నిజామాబాద్ నగరానికి చెందిన రజాక్ అతని తమ్ముడు, అనుయాయులు ఒకసారి కోర్టు మొట్టికాయలు వేసినా నిస్సిగ్గుగా భూదాహంతో వీరి భూమిని సైతం కాజేయాలనే కుట్ర చేస్తున్నారని తెలిపారు.

పైగా వీరికి 395 సర్వే నెంబరులో కేటాయించబడిందని, ప్రభుత్వ రికార్డుల ప్రకారం 395 సర్వే నెంబర్లు ఒక్క ఎకరం 22 గుంటలు మాత్రమే ఉందని, ఆరు నెలల క్రితం వరకు వారి పేరిట ఆన్లైన్ పాస్ పుస్తకాలలో కూడా ఒక్క ఎకరం 22 గుంటలు మాత్రమే ఉందన్నారు. ఇటీవల మూడు ఎకరాల ఒక్క గుంటగా ఎక్స్టెన్షన్ చేస్తూ పట్టా పాస్ పుస్తకాలు సంపాదించారని తెలిపారు. కాళ్ల చెప్పులు అరిగేటట్లుగా తిరిగినా పేద ప్రజలకు పట్టా పాస్ పుస్తకాలు అందచేయని అధికారులు.. ఈ ధనవంతులైన బోగస్ దారులకు ఎందుకు మంజూరు చేశారోనని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ భూమి ఒక్క బదరున్నీసా పేరుతోనే ఇప్పటికే 7 ఎకరాలపైననే అదేప్రాంతంలో ఉందని, మళ్ళీ మూడు ఎకరాల ఒక్క గుంట భూమిని ఏ విధంగా ఎక్స్టెన్షన్ చేసింద్రో అధికారులు చెప్పాలని పెద్ది వెంకట్రాములు నిలదీశారు. ప్రభుత్వాన్ని మోసం చేయడం, చట్టాన్ని దుర్వినియోగం చేయటం ఆనవాయితీగా మారిందన్నారు. అధికారులే తప్పులు చేస్తుంటే తప్పులు చేయించుకునే వాడు ఎంతకైనా దిగజారతాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్పందించి పేదలకు సహాయం చేయాలని నుడా చైర్మెన్‌ను కోరారు. లేనిచో భవిష్యత్తులో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

కార్మికుల ఆందోళన పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్

- బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒకవైపేమో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతుంటే, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఔట్‌సోర్సింగ్ కార్మికుల కాంట్రాక్ట్ విధానం ద్వారా హైదరాబాద్ కాంట్రాక్టర్లకు నెలకు రూ.2,25,760 అప్పనంగా అప్పజేపుతుందని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ ఆరోపించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మార్చ్ 25 నుంచి 28 బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్టియు ఆధ్వర్యంలో ఖమ్మం వరంగల్ తదితర మున్సిపల్ కార్పొరేషన్‌లలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల తరహాలో శానిటేషన్, వాటర్ సప్లై, ఫిల్టర్ బెడ్స్, స్ట్రీట్ లైట్స్, ఆఫీస్ స్టాఫ్ ఉద్యోగ, కార్మికుల ద్వారా విధులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ 4రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మాత్రం స్థానికులకు ఉపాధిని దెబ్బదీసి జిల్లా హైదరాబాద్ కాంట్రాక్టర్లకు టెండర్ పనులను అప్పగించారని తెలిపారు. నగర ప్రజల రెక్కల కష్టం ట్యాక్స్‌ల ద్వారా పనులు చేసిన డబ్బుల నుంచి స్థానికుల ఉపాధిని దెబ్బదీసి హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ రూ.250 కోట్ల టర్నోవర్ ఉన్న కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీకి టెండర్ ప్రక్రియ ద్వారా లక్షలాది రూపాయల కమీషన్ ఇవ్వడాన్ని నగర ప్రజలు ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు.

మల్లూర్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న నాయకులు , ముస్లింలు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరూ కూడా ఐకమత్యంతో ఉండాలని కులమత బేధాలు విడిచి స్నేహభావంతో మెలగాలని వారు ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి.. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉంటేనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బుడిమే మైశయ్య, బుడిమె శ్రీనివాస్, కిష్టారెడ్డి, పెద్ది అంజయ్య, భాస్కర్ రెడ్డి, గొల్ల హనుమాండ్లు, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

ఉగాది పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఎండ్లబండ్ల ప్రదర్శన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోనియకుండా నిర్వహించుకోవాలని తహసీల్దార్ సంజయ్‌రావు కోరారు. దోమకొండ మండల తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ సంజయ్ రావు, అధికారులు, నాయకుల ఆధ్వర్యంలో సమావేశం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎడ్లబండ్ల ప్రదర్శన కార్యక్రమం రూట్ మ్యాప్ సీరియల్ నెంబర్ ప్రకారం వెళ్లాలని నాయకులకు, ఎడ్లబండ్ల నిర్వాహకులకు సూచించారు. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉగాది పండుగ శాంతి యుతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జడ్పిటిసి తిరుమల గౌడ్, నాయకులు పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, కానుగంటి నాగరాజ్, మధు, రమేష్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ నియామకాల విచారణ వేగవంతం చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ అవకతవకలపై విచారణను వేగవంతం చేయాలనీ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ న్యాయంగా రావాల్సిన పోస్టులను డబ్బులకు అమ్ముకున్న మ్యాన్ పవర్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని, నిన్న మొన్నటి వరకు ఆర్డర్ కాపీ ఇచ్చిన ఉద్యోగ నియామకాలని రద్దు చేసి సరియైన మెరిట్ లిస్ట్ పెట్టి, అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులచే నియామకాలు పూర్తి చేయాలన్నారు.

ఢిల్లీలో పాపన్న మహారాజ్ నినాదం మారుమోగాలి

నవతెలంగాణ- కామారెడ్డి

ఢిల్లీలో పాపన్న మహారాజ్ నినాదం మారుమోగాలని జై గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ఏప్రిల్ 2న కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే కార్యక్రమానికి భారీ ఎత్తున గౌడ సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. గౌడ జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి తెలియజేసిన సర్దార్ పాపన్న మహారాజ్ నినాదం ఢిల్లీలో మారుమరోగించడానికి దేశవ్యాప్తంగా ఉన్న గౌడులంతా తరలిరావాలన్నారు. పాపన్న లేకుంటే మనభవిష్యత్తు లేదన్నారు. పాపన్న మహారాజ్ వారసులమని చెప్పేందుకు గర్వపడాలన్నారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం ప్రధాన కార్యదర్శి అంకన్న గారి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఇందూరి సిద్ధ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

• కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగు నామాది నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సావాలు నింపాలని అభిలషించారు. ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. ప్రస్తుత శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలు, ఆనందోత్సాహాలతో జీవనాలు వెళ్లదీయాలని ఆకాంక్షించారు.

బైక్ ఢీకొని మహిళా మృతి

నవతెలంగాణ - కామారెడ్డి

బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మహిళ.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్టు కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణం బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన వానరాశి గంగమ్మ (50) భిక్షాటన చేసుకొని జీవనం సాగించేదని, శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయలో గోదాము రోడ్డు నుండి బీడీ కాలనీకి నడుచుకుంటూ వెళుతుండగా, మార్గమధ్యలో గోదాం ల వద్దకు చేరుకోగానే, ఒక మోటారు సైకిల్ నడిపే వ్యక్తి వేగంగా వచ్చి, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గంగమ్మకు టక్కరు ఇవ్వగా, ఆమె యొక్క తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర రక్త గాయాలు కాగా, స్థానికుల సహాయంతో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. ఆమె సోదరుడైన సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి తోటి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. సీసీ రోడ్లు మంజూరు కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కొల్వి శ్రీకాంత్, చంటి, అమిన్, నారాయణ, మల్లేష్, ముత్తెన్న, శ్రీను, పి.ముత్తెన్న, శేఖర్ చిట్టన్న తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల, బంజారా భవనానికి భూమి పరిశీలన



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి, బంజారా భవన నిర్మాణానికి గానూ నడిపల్లి శివారులో గల ప్రభుత్వ భూమిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాలతో శనివారం నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ కుమార్, తహసిల్దార్ ప్రభాకర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొలసాని శ్రీనివాస్, చైర్మన్ రామచంద్ర గౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ షాదుల్లా తదితరులతో కలిసి పరిశీలించారు. వారి వెంట డిసిసి డైరెక్టర్ న్యాస రాజేశ్వర్, సురేష్ తోపాటు ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

• సెక్టార్ సమావేశంలో సూపర్వైజర్ సౌజన్య

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వం చిన్నారులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారంతో పాటు చిన్నారుల ఎత్తు బరువులను తప్పకుండా చూడాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య అంగన్వాడి టీచర్లను ఆదేశించారు. శనివారం మండలంలోని దండిగుట్ట గ్రామంలో సెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ చిన్నారులకు గుడ్లు పాలు సమయానుకూలంగా అందించాలని అన్నారు. అంగన్వాడి పరిసరాలలో ఆకుకూరలు,



మాట్లాడుతున్న సూపర్‌వైజర్

కాయగూరలు పండించి వాటితోనే చిన్నారులకు వంటలు చేయాలని ఆమె సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలకు పోషక ఆహారంపై అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అంగన్వాడీ టీచర్లు గర్భిణీ బాలింత మహిళలతో పాటు చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె అంగన్వాడి కార్యకర్తలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

ఆస్పత్రులను తనిఖీ చేసిన డిస్టిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ



ఆస్పత్రిని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని సిహెచ్ సి, కిసాన్ నగర్ గ్రామంలోని పీహెచ్ సి ఆస్పత్రులను శనివారం డిస్టిక్ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆస్పత్రిలలో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా, ఫార్మసీ నిర్వహణ, సిబ్బంది హాజరు, తదితర వాటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని సి హెచ్ సి లో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని వాటిని సరి చేసుకోవాలని సిబ్బందిని సూచించామని తెలిపారు. కిసాన్ నగర్ పీహెచ్ సి లో రికార్డులను, తనిఖీ చేసి కమిటీ సంతృప్తి చెందినట్లు డిప్యూటీ డిఎంహెచ్ తెలిపారు.

హామీలు ఎగొట్టే నైజం కాంగ్రెస్ డిఎన్ఏలోనే ఉంది

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హామీలు ఎగొట్టే నైజం కాంగ్రెస్ డిఎన్ఏలోనే ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే తత్వం కాంగ్రెస్ డీఎన్ఏలోనే లేదన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ చెత్తబుట్టలో వేశారని ఆరోపించారు. 'రాజీవ్ యువ వికాసం పథకం పెద్ద మోసమని, గారడీ అంకెలతో మళ్లీ మోసం చేసిందన్నారు. రూ.3 లక్షల 60 వేల కోట్ల బడ్జెట్లో రూ.60వేల కోట్లు కమీషన్ల రూపంలో మాయమవుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ముందు డిక్లరేషన్లను ప్రకటిస్తూ అన్ని వర్గాల ఓట్లను దండుకొన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ఆ డిక్లరేషన్లను చెత్తబుట్టలో పడేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ యావత్ తెలంగాణ జనులను మోసం చేసింది అన్నారు. గృహజ్యోతి వెలుగులు లేవు, రైతు భరోసా పైసల్ లేవు, ఇందిరమ్మ ఇండ్లు ఐదులక్షలు రాలే, ఇంటి జాగా జాడలేదు అని అన్నారు. చేయుత పింఛన్ పెరిగింది లేదు, యువ వికాసం నయా మోసమని తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రస్తావనే లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బడ్జెట్ నిండా మోసాలేనన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాళం రాజు, మండల అధ్యక్షులు తారక్ వేణు, గడ్డం రాజు, ఆనందరావు, నాగరాజు, తాజా మాజీ కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, బట్టు రాఘవేందర్, కిషోర్ ఇప్పకాయల, శ్రీధర్ పంచరెడ్డి, ఇల్లెందుల ప్రభాకర్, సాయివర్ధన్, ముత్యాలు, బీజేపీ నాయకులు పుట్ట వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ గ్రంథాలయ శాఖకు పుస్తకాల వితరణ



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్ర మైన రెంజల్ గ్రంథాలయ శాఖకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కార్యదర్శి బుగ్గారెడ్డిలు 29 పుస్తకాలను అందజేసినట్టు గ్రంథ పాలకులు సంపత్ కుమార్ తెలిపారు. ఇటీవల ఈ గ్రంథాలయాన్ని సందర్శించిన సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ త్వరలో కాంపిటీషన్ సంబంధించిన పుస్తకాలను సైతం అందజేస్తామని చెప్పారని దానిలో భాగంగానే ఈరోజు 29 కాంపిటీషన్ పుస్తకాలను పంపించడం జరిగిందన్నారు. రైల్వే స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్‌కు సంబంధించిన పుస్తకాలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అంతి రెడ్డి రాజిరెడ్డి, కార్యదర్శి బుగ్గారెడ్డిలకు స్థానిక యువత ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు సంపత్ కుమార్, సిబ్బంది సాయిలు, యువత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్డు పనులను ప్రారంభించినట్లు మాజీ జడ్పిటిసి నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు. రెండు లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈసీసీ రోడ్డు నాణ్యతతో చేపడుతున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఇందిరా దేవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సగ్గు వెంకటి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, గైని సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పదోతరగతి విద్యార్థి మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్ వాయి మండలంలోని గన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థి ఎల్ వి శ్రీ హర్ష (15) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు గ్రామస్తులు, అధ్యాపకులు తెలిపారు. గత కొన్ని రోజులు క్రితం ప్రారంభమైన పదోతరగతిలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరీక్షలు రాశాడు. ఆ తర్వాత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. శ్రీహర్ష మృతిపట్ల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ గద్దె వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాలకు ఎన్టీఆర్ లాంటి మహోన్నత వ్యక్తిత్వం ఉన్న నాయకులు ప్రస్తుత రాజకీయల్లో ఎవరులేరన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు డాక్టర్ రాములు, జనార్ధన్, లక్ష్మీ రాజాం, లోక రాములు, సాగర్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులలో భాగంగా వేసవి ఎండలు పనిచేస్తున్న కూలీలకు క్షేత్ర సహాయకులు డి.శంకర్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వీటిని నీటిలో వేసుకొని తాగాలని ఆయన కూలీలకు సూచించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.